ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.9 । కనిష్ఠం 24.5





అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్



కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

చామన్‌పెల్లి గ్రామం వద్ద వర్షానికి తడుస్తున్న తూకం వేసిన ధాన్యం సంచులు

అన్నదాతకు తీరని నష్టం

- భారీ వర్షాలకు జిల్లా అతలాకుతలం
- కల్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యం
- ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై అన్నదాత ఆగ్రహం
- పలుచోట్ల ధర్నాలతో అట్టుడికిన జిల్లా
- రైతులకు మద్దతుగా పలు పార్టీల ఆందోళన
- కలెక్టర్ తీరుపై మండిపడ్డ బీజేపీ జిల్లా అధ్యక్షుడు
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని కలెక్టర్‌తో సహా ఖానాపూర్ ఎమ్మెల్యే హామీ
- జిల్లాలో 37.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

నిర్మల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా అతలాకుతలం అవుతోంది. ఈ అకాల వర్షాలకు అన్నదాతలు ఆందోళన చెందాల్సిన పరిస్థితి తలెత్తింది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో రైతన్నకు తీవ్రనష్టం వాటిల్లింది. ఓవైపు చేతికి అందిన పంట నీటి పాలవుతుంటే దానిని చూసి అన్నదాత కన్నీటి పర్యంతం కావాల్సిన పరిస్థితి తలెత్తింది. ఎక్కడ చూసిన జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం రాశులు పేరు కుపోయి కనిపిస్తున్నాయి. మరో నాలుగు రోజులపాటు భారీ వర్షాలు ఉన్నట్లు చెబుతున్న నేపథ్యంలో అన్నదాతల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. తమ ధాన్యాన్ని కొనుగోలు చేయలని ఎక్కడికి అక్కడ రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. దీంతో గురువారం జిల్లా అన్నదాతల ఆందోళనతో అట్టుడికింది. ఈ పరిస్థితికి ప్రభుత్వ నిర్లక్ష్యం అధికారుల అలసత్వమే కారణం అంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. కలెక్టర్ తీరు పై బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ మండిపడ్డారు. ఓ వైపు పంటకల్లాల్లో ధాన్యం తడిసి ముద్దయితుంటే మరోవైపు కోతలు పూర్తికాని పొలం నేలవాలిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి జిల్లాలో కురిసిన ఈ అకాల వర్షం రైతన్నను ఆగమాగం చేసిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తడిసిపోయిన ధాన్యంతో నష్టం

ఆరుగాలం శ్రమించి రాత్రనకా పగలనకా ఎండనక వాననక ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకొని పండించిన పంట చివరికి వర్షంలో తడిసిపోవడంతో తమకు తీరని నష్టం వాటిల్లిందని జిల్లా రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. జిల్లాలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం నుండి కురిసిన భారీ వర్షాలకు పంట కల్లాల్లోని ధాన్యం పూర్తిస్థాయిలో తడిసి ముద్దయిపోయింది. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం వరి పంట సగానికి పైగా చేతికందడంతో కోతలు పూర్తయ్యాయి. కోతలు పూర్తయిన వరి పంట తాలూకు ధాన్యమంతా పంట కల్లాలకు చేరింది. మరో సగం పంట వ్యవసాయ క్షేత్రంలోనే కోతలకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం కురుస్తున్న ఈ వర్షాలకు పంట కల్లాలకు చేరిన ధాన్యం తడిసిపోవడంతో పాటు వ్యవసాయ క్షేత్రాలలో కోతదశకు చేరుకొని కోతలకు సిద్ధంగా ఉన్న వరి పంట సైతం దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కోత దశకు చేరుకున్న నేపథ్యంలో భూమిని ఆరబెట్టేందుకు గత 20 రోజుల నుంచి పంటకు నీళ్లు ఇవ్వకుండా రైతులు జాగ్రత్తలు పడ్డారు. కానీ గత రెండు రోజులుగా కురిసిన ఈ భారీ వర్షాలకు మరో 20 రోజుల వరకు వ్యవసాయ క్షేత్రాలలో కనీసం హార్వెస్టర్ దిగలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు హార్వెస్టర్ నడవక అటు వ్యవసాయ కూలీలు దొరకక ఇక చేతికి అందిన పంట నేలవాలి పోవాల్సిందేనని ఆందోళన చెందుతున్నారు.

ధర్నాలతో అట్టుడికిన జిల్లా..

తాము పండించిన పంట అమ్ముకునే సమయానికి అకాలవర్షానికి తడిసి ముద్దవ్వడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఒక్కసారిగా జిల్లా వ్యాప్తంగా రైతు సంఘం ఎక్కడికక్కడ ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహించింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యంపై రైతాంగం మండిపడుతోంది. సెంటర్ నిర్వాహకులు మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎక్కడికక్కడ కమీషన్లకు కక్కుర్తి పడి తక్కువ కూలీలను ఏర్పాటు చేయడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయిందని మండిపడుతున్నారు. రైతుల వద్ద నుంచి క్వింటాల్‌కు 40 రూపాయల చొప్పున హమాలీ డబ్బులను వసూలు చేస్తూ అందులోంచి కేవలం 30 రూపాయలు మాత్రమే హమాలీలకు చెల్లిస్తూ ప్రతి రైతు వద్ద క్వింటాల్‌కు పది రూపాయలను అదనంగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. ధాన్యం తూకం వేసే సమయంలోనే క్వింటాల్‌కు అదనంగా రెండున్నర కిలోలు ఇస్తున్నప్పటికీ మళ్లీ మిల్లులకు వెళ్లాక మరో ఐదు కిలోలు ఇస్తే తప్ప ధాన్యం మిల్లు యజమానులు తీసుకోవడం లేదని చెబుతూ అదనపు దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడుతున్నారు. ఇలా ఒక్కో రైతుకు క్వింటాల్‌కు ధాన్యానికి రూ.160 నుంచి రూ. 180 వరకు అదనంగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. తడిసిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్ తీరుపై మండిపడ్డ బీజేపీ జిల్లా అధ్యక్షుడు

జిల్లావ్యాప్తంగా గురువారం రైతులు రాస్తారోకోలు నిర్వహించడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులకు మద్దతుగా బీజేపీ, బీఆర్‌ఎస్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా తదితర ప్రతిపక్ష పార్టీలు, వామపక్ష పార్టీలు ధర్నాల్లో పాల్గొన్నాయి. జిల్లాలోని కడెం, ఖానాపూర్ మండలాల్లో నిర్వహించిన పలు రాస్తారోకోల్లో రైతులకు మద్దతుగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్‌రాథోడ్ కలెక్టర్ తీరుపై మండిపడ్డారు. కలెక్టర్‌కు తాము ముందుగానే ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కోరినప్పటికీ ఆమె నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారన్నారు. కలెక్టర్ సహా ఇతర అధికారుల నిర్లక్ష్యంతోనే నేడు రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, పంటకల్లాల్లో ధాన్యం తడిసిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలులో జరుగుతున్న దోపిడీలో అధికారులతో పాటు ప్రభుత్వ పెద్దలకు సైతం వాటా వెళ్తోందని ఆరోపించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని కలెక్టర్‌తో సహా ఖానాపూర్ ఎమ్మెల్యే హామీ

జిల్లావ్యాప్తంగా రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేయడంతో హుటాహుటిన అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించింది. కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, సివిల్ సప్లై డీఎం సుధాకర్, ఆర్డీవో రత్నకల్యాణి, తదితర అధికార యంత్రాంగమంతా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించింది. ఖానాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సహా కలెక్టర్ ఇతర అధికారుల బృందం పరిశీలించి వర్షానికి తడిసిన ధాన్యం కొనుగోళ్లపై రైతులకు హామీ ఇచ్చారు. ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ రైతులకు హామీ ఇచ్చారు. రైతుల ఆందోళనలో న్యాయం ఉందంటూ రైతులకు న్యాయం చేసేలా ధాన్యం కొనుగోలు అదనపు తూకాలను అరికట్టేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు.



ఖానాపూర్‌లో ధాన్యం తూకం వేసి పది రోజులైనా ఎందుకు మిల్లుకు తరలించలేదని అధికారులపై మండిపడుతున్న మహిళా రైతు

జిల్లాలో 37.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉదయం నుండి రాత్రి వరకు భారీ వర్షం కురియడంతో జిల్లాలో 37.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ఈ భారీ వర్షాలకు జనజీవనం అతలాకుతలం అయ్యింది. ఓవైపు పంటలకు తీరని నష్టం చేకూర్చిన ఈ అకాల వర్షంతో లోతట్టు ప్రాంతాలు సైతం జలమయమయ్యాయి. అకాల వర్షంతో జరిగిన నష్టంపై సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం అందజేయాలని పలువురు కోరుతున్నారు.



ఖానాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్

స్వర్ణవాగులో చెక్‌డ్యామ్ పేల్చివేత

- ఎత్తు తొలగింపు చర్యలు
- జీఎన్‌ఆర్‌కాలనీ రక్షణ కోసమేనంటున్న అధికారులు



కొట్ల(కే) వద్ద ఉన్న స్వర్ణవాగులో చెక్‌డ్యామ్‌ను పేల్చుతున్న దృశ్యం
ఇన్‌సెట్‌లో చెక్‌డ్యామ్‌ను పేల్చిన అనంతరం నీరు బయటకు వస్తున్న దృశ్యం

నిర్మల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వర్షాకాలంలో వరద ముంపుకు గురవుతున్న నిర్మల్ పట్టణంలోని జీఎన్‌ఆర్ కాలనీని రక్షించేందు కోసం సమీప స్వర్ణ వాగులోని చెక్ డ్యామ్‌కు చెందిన కొంత భాగం పేల్చివేశారు. ఇటీవలే జిల్లా కలెక్టర్ జీఎన్‌ఆర్ కాలనీని సందర్శించి ముంపు పరిస్థితులను తెలుసుకున్నారు. వాగు పక్కనే ఉన్న ఈ కాలనీ ముంపుకు గురికావడానికి వాగులోని ఎత్తయిన చెక్ డ్యామ్ కారణమని సంబంధిత అధికారులు నిర్ధారించారు. ఎత్తు తగ్గింపు పనులకు అవసరమైన నిధులను కూడా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మంజూరు చేయించారు. దీంతో గురువారం చెక్ డ్యామ్‌ను నిర్ధారించిన కొలత మేరకు డైనమైట్‌తో పేల్చి వేశారు. చెక్ డ్యామ్ ఎత్తు తగ్గడంతో వాగులోని వరద ప్రవాహం జీఎన్‌ఆర్ కాలనీలోకి చేరే అవకాశం ఉండదు. దీంతో జీఎన్‌ఆర్ కాలనీకి రాబోయే వర్షాకాలంలో వరద ముప్పు తప్పనుందని చెబుతున్నారు.

వలలో చిక్కుకుని జాలరి మృతి




మేకల నర్సయ్య (ఫైల్)



చెరువు నీటిలో నర్సయ్య మృతదేహం

దిలావర్‌పూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కల్పిస్తున్న వృత్తే ఉసురు తీసింది. నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... చేపలు పడుతూ ఉపాధి పొందుతున్న దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామానికి చెందినయువకుడు మేకల నర్సయ్య(32) ప్రతి రోజు లాగే చేపల వేటకు వెళ్లాడు. చేపల కోసం వల విసురుతుండగానే అది ప్రమాదవశాత్తు నర్సయ్య కాళ్లకు చుట్టుకుంది. అదుపు తప్పిన నర్సయ్య నీటిలో పడి మృతి చెందాడు. స్థానికులు కొందరు గమనించి నర్సయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

భూముల వేలం పాట



తానూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రభుత్వ ఆదీనంలో ఉన్న భూములను గురువారం వేలంపాట నిర్వహించినట్లు తహసీల్దార్ లింగమూర్తి తెలిపారు. మండల కేంద్రం తానూర్ శివారులో ఉన్న 165 ఎకరాల 35 గుంటల ప్రభుత్వ ఆదీనంలో ఉన్న ఇనాం భూములకు వేలం పాటను నిర్వహించారు. సర్వేనెంబర్ 92లో గల 92ఎకరాల 17గుంటల భూమిని అబ్దుల్ కరీం రూ. 37వేలకు, సర్వేనెంబర్ 37లో గల 19 ఎకరాల 6గుంటల భూమిని అయూబ్‌ఖాన్ రూ. 2,29,000 లకు, సర్వేనెంబర్ 191లో గల 54ఎకరాల 12 గుంటల భూమిని షన్వాజ్‌ఖాన్ రూ. 3,06,000లకు వేలం పాటలో దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ భూమి సంవత్సరం పాటు వారి అదీనంలో ఉండనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మోహన్‌సింగ్, నరేష్, సీనియర్,జూనియర్ అసిస్టెంట్లు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

జిల్లా కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టణ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి అంశాలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పట్టణంలోని ప్రధానకూడళ్లను సుందరీకరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ట్యాంకులు అభివృద్ధి, వీధి లైట్ల ఏర్పాటు, రోడ్ల విస్తరణకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. జూన్ 30 లోపు గృహ, వాణిజ్య పన్నుల వసూలు వంద శాతాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వార్డులో పారిశుద్ధ్య, డ్రై డే కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా దోమల నియంత్రణకు అవసరమైన ఫాగింగ్ మిషన్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. వీధి వ్యాపారులకు ఇబ్బందులు కలుగకుండా మార్కెట్ ప్రాంతాల్లో తగిన సదుపాయాలను కల్పించాలన్నారు. ముఖ్య కూడళ్ల వద్ద వ్యర్థాలను పారవేయకుండా డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని, పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్ రాజు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకే అందించాలి

ఖానాపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకే అందేలా చర్యలు చేపట్టాలని మండల అధికారులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశం మందిరంలో స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి జిల్లా, మండల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులు నిబంధన మేరకు పూర్తయ్యేలా చూడాలని, జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి పనిదినాలు కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. గిరిజన ప్రాంతాలలో ప్రజలకు రవాణా సౌకర్యం, తాగు నీరు, విద్యుత్ తదితర అభివృద్ధి పనులకు అటవీ శాఖ అనుమతులను వెంటనే మంజూరు చేయాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగించాలన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో రోడ్ల మరమ్మతులు ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. కడెం ప్రాజెక్టు నిర్వహణ, భారీ వర్షాలు, వరదల వలన తలెత్తే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను ముందస్తుగానే అప్రమత్తం చేయలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలను చేపట్టాలని కలెక్టర్ సూచించారు.



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, వేదికపై ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

అధికారుల సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యం

ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తేనే క్షేత్రస్థాయిలో అభివృద్ధి సాధ్యమవుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. ఖానాపూర్‌లోని ఎంపీడీవో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవత్‌తో కలిసి నిర్వహి ంచిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జు పాల్గొన్నారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా ప్రతిశాఖ పని చేయాలన్నారు. బాధ్యతాయుతంగా పని చేసే ప్రతి అధికారిని ప్రజలు గుర్తుపెట్టుకుంటారన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాల అమలులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారిని నాగిని భాను, ఆర్డీవో రత్నకల్యాణి, సీపీవో జీవరత్నం, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, నీటి పారుదల శాఖల అధికారులు అశోక్‌కుమార, శంకరయ్య, విఠల్, స్థానిక మున్సిపల్ కమిషనర్ జాదవ్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో ప్రజలను ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నాం

- ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ఆదుకునేందుకు పోలీసుశాఖ సిద్ధంగా ఉందని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. గురువారం సాయుధ దళ కార్యాలయంలో వరద సహాయక సామగ్రిని ఎస్పీ తనిఖీ చేశారు. వర్షాలతో ఇబ్బంది తలెత్తే ప్రాంతాల్లో ప్రజలను కాపాడేందుకు ఎయిర్ బోట్లు, లైవ్ జాకెట్లు, ట్యూబ్స్, రోప్స్ సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రాణహాని కలుగకుండా ప్రజలను కాపాడేందుకు అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అధికారులతో తనిఖీలు నిర్వహించామని, ప్రజలు ఆందోళన చెందవద్దని తెలపారు. 70 మందికి నిష్ణాతులతో శిక్షణ ఇప్పించినట్టు తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులు గత సంవత్సరం వరద నష్టాలు దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్ఐ రాంనిరంజన్, రమేష్, రవి కుమార్, రాజశేఖర్, సాయికృష్ణ, స్పెషల్ పార్టీ సిబ్బంది శివంగి టీమ్ పాల్గొన్నారు.



వరద సహాయక పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

కలెక్టరేట్‌లో ఘనంగా

భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు

నిర్మల్ అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : దళిత మహిళలు, విద్యార్థుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన మహనీయుడు ఎం. భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి వేడుకలను గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... దళితుల అభ్యున్నతికి, ముఖ్యంగా దళిత మహిళల విద్యాభివృద్ధికి భాగ్యరెడ్డి వర్మ చేసిన కృషి అపూర్వమన్నారు. ఆయన స్థాపించిన బాలికల పాఠశాలలు, విద్యా సంస్థలు దళితులకు వెలుగుల పతాకంగా నిలిచాయని కొనియాడారు. మహనీయుల జయంతులను అధికారికంగా నిర్వహించడం గర్వకారణమని, వారి ఆశయాల సాధనలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. వీటి ద్వారా యువతలో సమాజ సేవాస్ఫూర్తి పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. వర్మ ఆశయాలను నెరవేర్చే దిశగా చొరవ చూపలని అదనపు కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అభివృద్ధి శాఖల అధికారులు రాజేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్, శంకర్, మోహన్ సింగ్, నరసింహ రెడ్డి, దళిత సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..



నివాళులర్పిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సంఘ సంస్కర్త, దళిత ఉద్యమ నాయకుడు భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకను జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ జానకీషర్మిల ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ... భాగ్యరెడ్డి వర్మ జీవితం, ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. సామాజిక సమానత్వం, విద్యాభివృద్ధికి ఆయనచేసిన కృషిని కొనియాడారు. అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఏవో యూనిస్‌అలీ, ఇన్స్‌పెక్టర్లు ప్రవీణ్‌కుమార్, సమ్మయ్య, ఆర్ఐలు రాం నిరంజన్‌రావు, రమేష్, రవికుమార్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..



..నివాళులర్పిస్తున్న కమిషనర్

నిర్మల్ కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను ప్రభుత్వ పరంగా నిర్వహించారు. కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సానిటరీ ఇన్స్‌పెక్టర్ ఎన్. ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ అనూప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



జొన్న పంటను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం

ఈనెల చివరివరకూ జొన్న కొనుగోళ్లు

● ఆదిలాబాద్ మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి

బోథ్, మే 22 (ఆంధ్రజ్యోతి): మే చివరి వరకు జొన్న పంటను కొనుగోళ్లు చేపడతామని ఆదిలాబాద్ మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం బోథ్ మార్కెట్ యార్డులో జొన్న పంట బస్తాలను పరిశీలించారు. రైతులు పంట తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల దృశ్యం పంట కొనుగోళ్లలో కొంత జాప్యం జరుగుతోందన్నారు. రైతులు తమ పంటను మే నెల చివరి తేదీ వరకు పంటను తీసుకురావాలని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ సిబ్బంది సహకార సంఘం వారు చూడాలని కోరారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డితో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి. రాజు యాదవ్ ఉన్నారు. కాగా డిఎం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని పరిశీలించారు. చేపట్టిన కార్యక్రమం ఎంతో గొప్పదని అభినందించారు.

కొనుగోళ్లను పరిశీలించిన డీఎం

బోథ్ మార్కెట్ యార్డులో జొన్న కొనుగోళ్లను మార్క్‌ఫెడ్ డిఎం ప్రవీణ్ రెడ్డి బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డితో కలిసి పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని సొసైటి సిబ్బందికి సూచించారు. ఈ నెల చివరి వరకు కొనుగోళ్లు జరుగుతాయాని రైతులు పండించిన పంటను ఈ నెల చివరి వరకు మార్కెట్‌కి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్‌కు పంటను అమ్ముకోవడానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి ఆకలి తీరుస్తున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొర్ల రాజు యాదవ్‌ను అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలి

● గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఈఈ షాకీర్

తాంసి, మే 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఈఈ ఎంఏ షాకీర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుకున్న సమయంలోపే ఇందిరమ్మ ఇళ్లను పూర్తిచేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖ అధికారులు దగ్గర ఉండే పనులు జరిపించాలన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల విష యంలో లబ్ధి దారులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టామన్నారు. సకాలంలో బిల్లులు చెల్లిస్తామని ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించాలని కోరారు. తాంసి మండల కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ ఇంటి నిర్మాణం మాదిరిగానే ప్రతీఒక్కరు ఇంటిని నిర్మించుకోవాల్సి ఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా పనుల్లో నాణ్యతను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేఈ నసీర్ అహ్మద్, రామన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో భారీ వర్షం

● 18.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు ● కొనుగోలు కేంద్రాలలో తడిసిన జొన్నలు

ఆదిలాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో వరుసగా రెండో రోజూ అకాల వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేశాయి. గురువారం మధ్యాహ్నం నుంచి జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఆదిలాబాద్ జిల్లాసగటు వర్షపాతం 1.0 మి.మీలు కాగా అధికంగా 18.6 మి.మీల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా భీంపూర్ మండలంలో 39.8 మి.మీలు, బజార్ హత్నూర్‌లో 37.1, తలమడుగులో 27.4, గుడిహత్నూర్‌లో 24.5, జైనథ్‌లో 22.7 మి.మీల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా బోథ్‌లో 6.2 మి.మీల వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కొనుగోళ కేంద్రాలకు తరలించిన జోన్నలు తడిసి పోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్న జొన్నల కొనుగోలు వేగవంతం కావడం లేదని రైతులు చెబుతున్నారు. కురుస్తున్న వర్షాలకు అధికారులు కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నారు. దీంతో జొన్నల కొనుగోళ్లు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. మరో వారం రోజుల్లోనే వానకాల సీజన్ ప్రారంభంకానుంది. ఇప్పటికే కొంతమంది రైతులు పంటల సాగుకు శ్రీకారం చుడుతున్నారు. అయితే తడిసిన జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పలు చోట్ల గోనెసంచుల కొరత ఉండడంతో కొనుగోళ్లు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. ఈనెల చివరి వరకు జొన్న కొనుగోళ్లను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నా రెండు రోజులుగా అకాల వర్షాలతో ఆటంకాలు ఏర్పడుతున్నాయి.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

తాంసి, మే22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను అరులైన వారికే ముందుగా కేటాయించాలని బీజేపీ మండల నాయకులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం తహసిల్దార్‌కు, ఎంపీడీవోలకు అందజేశారు. అర్హులు అయిన వారిని పక్కన పెట్టి అనర్హులకే కాంగ్రెస్ నాయకులు ఇళ్లు కేటాయించడం సమంజసం కాదని హెచ్చరించారు. ముందుగా ఇల్లు లేని వారిని గుర్తించి, దళితులకు, వికలాంగులకు, వాగుబడ్డున ఉన్నవారికి ఇవ్వాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో దశల వారి పోరాటం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్ రెడ్డి, విలాస్, పరమేశ్వర్, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

● మండల విద్యాధికారి వెంకట్‌రావు

తలమడుగు, మే22 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని, మహిళల్లో సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంఈవో వెంకట్‌రావు అన్నారు. గురువారం ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సెర్ప్ మహిళాగ్రూపు సభ్యులకు మండలంలోని అన్ని గ్రామాల వీవో, వీఏవోలకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, ఏపీఎం చంద్రశేఖర్, సిసి మండలంలోని అన్ని గ్రామాల వివోఏలు, మండలం సెర్ప్ గ్రూపు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి

● టీపీసీసీ ఉపాధ్యక్షుడు, పరిశీలకులు తాహెర్ బిన్ హందాన్

ఆదిలాబాద్‌రూరల్/ మావల, మే22 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పార్టీ బలోపే తం కోసం ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని టీపీసీసీ ఉపాధ్య క్షుడు పరిశీలకులు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ అన్నారు. పార్టీ కోసం కష్ట పడేవారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయని, జెండా మో సిన కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని తెలిపారు. గురువారం యాపల్‌గూడలో ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఆదిలాబాద్‌రూరల్, సాత్నాల, మావల మండలాల కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి మరో పరిశీలకులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ మూడు మండలాలలో కాంగ్రెస్ పార్టీకి పునర్ వైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ కోసం కష్టపడే నాయకులే పదవులకు అర్హులన్నారు. అనంతరం టీపీసీసీ ప్రధానకార్యదర్శి పరిశీలకులు చిట్ల సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ ప్రక్షాళన కోసమే ఈ విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్టీ ఆదేశానుసారం జిల్లాలో పార్టీని తిరిగి పటిష్ఠం చేసేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సాధించడమే లక్ష్యంగా ప్రతీ నాయకుడు కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం పని చేసేవారిని పార్టీ తప్పక గుర్తిస్తుందన్నారు. ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూకబ్జాలకు పాల్పడుతున్నాడని, కబ్జా బాగోతాన్ని బయటపెట్టాలని అన్నారు. దాదాపు రూ.388కోట్ల రూపాయల కబ్జాలకు పాల్పడినట్టు ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, ఆదిలాబాద్ రూరల్ మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అల్చెట్టి నాగన్న,మాజీ ఎంపీటీసీలు కుమ్ర జంగు పటేల్,చిట్యాల భూమన్న, బిక్కి గంగాధర్ నాయకులు సుధాకర్ గౌడ్,పోరెడ్డి కిషన్, మునిగేల విట్టల్,యెల్టీ భోజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాహెర్ బిన్ హందాన్

ఆక్రమణల తొలగింపుపై అలజడి!

(5వ పేజీ తరువాయి...)

వ్యాపారం చేసుకునేలా అనుమతించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా వీధి వ్యాపారాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. అయితే వీధి వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రత్యామ్నాయంగా స్థలాలను కేటాయించినట్లు పేర్కొంటున్నారు. వీధి వ్యాపారుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం కావడంతో అధికారులు కొంతవెనుకడుగు వేసినట్లు కనిపిస్తుంది. అయితే త్వరలోనే పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపడుతామని అధికారులు పేర్కొనడం మరింత ఆందోళనకు దారి తీస్తోంది.

మహనీయుల జీవిత చరిత్రను అందరూ తెలుసుకోవాలి : కలెక్టర్

ఆదిలాబాద్‌అర్బన్, మే22 (ఆంధ్రజ్యోతి): మహనీయుల జీవిత చరిత్ర, పోరాటాల గురించి అందరూ తెలుసుకోవాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మాదరి భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతిని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలువేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగ్యరెడ్డివర్మ చేసిన సేవలను స్మరించారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి, అధికారులు తదితరులున్నారు.



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

మాల సంక్షేమ సంఘం భవనంలో..

దళిత జాతి ముద్దు బిడ్డ భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతిని మాల సంక్షేమ సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ సొంత ఖర్చులతో హైదరాబాద్‌లో 26 స్కూల్స్ ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేష్, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి సుధాకర్, గౌరవ అధ్యక్షులు మేకల మల్లన్న, సీనియర్ నాయకులు బేరదేవన్న, సింగరి అశోక్, పోశెట్టి, స్వామి, అసోసియేట్ అధ్యక్షులు రాఘవేంద్ర, యువనాయకులు రమేష్ పాల్గొన్నారు.

వర్షంతో అన్నదాతలకు ఇక్కట్లు

ఉట్నూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు అన్నదాతలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. యాసంగి పంటల్లో భాగంగా వరి ధాన్యం పండించిన రైతులు తమ ధాన్యమును అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. కొందరు రైతులు కొనుగోలు కేంద్రాల వద్దనే తమ పంటను ఆరబెట్టుకుంటున్నారు. ఉట్నూర్ మండలంలోని గంగన్నపేట, బీర్సాయిపేట ప్రాంతాలలో జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు వరి ధాన్యం అమ్ముకుంటున్నారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ఒక ఇద్దరురైతుల వరిధాన్యం కొంత తడిచినప్పటికి రైతులు ముందు జాగ్రత్తగా తాము తెచ్చిన పంటల నిలువల పై ప్లాస్టిక్ కవర్లుకప్పుకొని భద్రంగా ఉంచడంతో వర్షానికి నష్టం జరగకుండా రైతులు పంటను కాపాడుకోగలిగారు. గంగన్నపేట వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో రోజూ రెండు నుంచి 300 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని ఇప్పటి వరకు 1200 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు శాంతినగర్ గ్రామాఖ్య సంఘం నిర్వాహకులు తెలిపారు.



గంగన్నపేటలోని కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం తడవకుండా కవర్లు కప్పుతున్న రైతులు



వర్షపాతం నమోదును పర్యవేక్షిస్తున్న అధికారులు

నిర్మల్‌లో వర్షపాతం కొలత పర్యవేక్షణ

నిర్మల్ రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అకాల భారీ వర్షాలు కురుస్తున్నందున గురువారం రోజు అత్యధికంగా వర్షం కురిసిన లక్ష్మణచాంద మండలాన్ని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జీవరత్నం వర్షాపాతం కొలతను పర్యవేక్షించినట్లు తెలిపారు. ఉదయం 8:30 నిమిషాలకు లక్ష్మణచాంద మండలంలోని మాన్యువల్, రెవెన్యూ వర్షపాతంను కొలువగా 99.6 నమోదైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రణాళిక, గుణాంకాధికారి నరేష్, టెక్నీషియల్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవ కార్యక్రమానికి మొక్కలను సిద్ధంగా ఉంచాలి

నర్సాపూర్(జి), మే 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సెంట్రల్ నర్సరీ ఈజీఎస్ నర్సరీలను మంగళవారం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ బాసర సర్కిల్ శరవణన్ ఐఎఫ్ఎస్, జిల్లా అటవీ శాఖ అధికారి నాగిని భాను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... వన మహోత్సవ కార్యక్రమానికి మొక్కలు సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది, బీట్ ఆఫీసర్ సాయిరెడ్డి, అలేఖ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ వ్యాపారస్తుల వద్దకు ధాన్యం

నర్సాపూర్(జి), మే 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్లు వరి కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన వరి ధాన్యం ప్రైవేట్ వ్యాపారుల వద్దకు మంగళవారం రైతులు ఆటోల ద్వారా తీసుకు వెళ్లారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి అధికారులు రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో వరి ధాన్యం పూర్తిగా తడిసిపోతోందేమోనని భయంతో ప్రైవేట్ వ్యాపారుల వద్దకు తీసుకెళ్తున్నట్లు రైతు అస్లాం షా తెలిపారు. రైతు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి భద్రత చర్యలు కల్పించట్లేదని టార్పాలిన్లు అందిస్తే బాగుంటుందని తెఽపారు.

కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు

కుంటాల, మే, 22 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని కల్లూరు హైస్కూల్‌లో ఉపాధ్యాయ శిక్షణ తరగతులు కొనసాగు తున్నాయి. టీచర్స్ కెపాసిటి, బిల్డింగ్‌పై మండలంలోని ఆయా పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కొనసాగుతుందని ఎంఈవో ముత్యం తెలిపారు. ఉపాధ్యాయులు ఈ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానంతో విద్యార్థులకు విద్యాబోధన చేయనున్నట్లు ఆయన తెలిపారు.

సొంత గూటికి చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

నర్సాపూర్(జి), మే 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన బర్కుంట రమేష్, గంగాధర్, దర్శనం లక్ష్మణ్, చింటూ మంగళవారం రామ్‌కిషన్, అజయ్ ఆధ్వర్యంలో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లి కండువా వేసుకున్నారు.

మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డిజిటల్స్ ఎక్స్‌రే ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఖానాపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రతి నిరుపేదకు మెరుగైన వైద్యాన్ని అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఖానాపూర్‌లోని ప్రభుత్వం ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ ఎక్స్‌రే యంత్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లకు సూచించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజా సేవకు అంకితమవ్వాలన్నారు. స్టోర్‌రూమ్‌లో భద్రపరిచిన మందులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. మందుల కొరత లేకుండా పర్యవేక్షించాలని ఆసుపత్రి పర్యవేక్షకులకు సూచించారు. ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డిజిటల్ ఎక్స్‌రే యంత్రం లేకపోవడంతో ఇన్నాళ్ల ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఎక్స్‌రేలు చేయించుకోవాల్సిన వచ్చేదని ఆ సమస్యకు చెక్ పెట్టేందుకే తమ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రికి డిజిటల్ ఎక్స్‌రే యంత్రాన్ని మంజూరు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి కావలసిన సౌకర్యాలు అన్నింటిని కల్పించేందుకు తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీసీహెచ్ఎస్ సురేష్, ఆసుపత్రి సూపరిండెంట్ వంశీమాధవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజిద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణాధ్యక్షులు నిమ్మల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్లు చిన్నం సత్యం, అంకం రాజేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగనర్సయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు శోభన్‌బాబు, తదితరులున్నారు.



ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డిజిటల్ ఎక్స్‌రే ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

● జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు

లక్ష్మణచాంద, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు గురువారం అన్నారు. వడ్యాల్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు పాఠశాలకు నిర్దేశించిన సమయానికి హాజరు కావాలని, విద్యార్థుల నమోదు పెంచడానికి విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులపై నమ్మకం పెంచే ప్రయత్నం చేయాలన్నారు. దీనికి గాను విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలకు, ప్రభుత్వ పాఠశాలకు తేడాలు తెలియజేయాలని చెప్పారు. పాఠశాలలో ఉపాధ్యాయులు బెస్ట్ ప్రాక్టీసను స్కెర్ట్ వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. శిక్షణలో నేర్చుకున్నవి పాఠశాల స్థాయిలో అమలు పరచాలని తద్వారా అంచనా వేసిన అభ్యసన ఫలితాలు వస్తాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, డిజిటల్ విద్య వైపు ప్రభుత్వ బడులు ముందుకెళ్తున్నాయన్న విషయాన్ని ప్రతి ఇంటికి చేరవేయాలని సూచించారు. వివిధ మార్గాల్లో వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని, అంకిత భావం ఉంటే అన్ని సాధ్యమేనని పేర్కొన్నారు. నాణ్యమైన బోధన నైపుణ్యమున్న ఉపాధ్యాయులు ప్రభుత్వ బడుల్లోనే ఉన్నారన్న వాస్తవాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు అర్థమయ్యేలా చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఆర్. అశోక్ వర్మ, మండల రిసోర్స్ పర్సన్లు అర్చన, శివరాణి, మోహన్ చంద్రమోహన్, తేజ, సాయన్న, గంగాధర్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు మహేందర్, సుధాకర్, మండల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.



ఉపాధ్యాయ శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో

ప్రతీ రైతు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

కుంటాల, మే, 22 : (ఆంధ్రజ్యోతి) : భూగర్భ జలాలను అరికట్టేందుకు మండలంలోని ప్రతిరైతు యొక్క పంటచేనులో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా చూడాలని డీఆర్‌డీవో విజయలక్ష్మీ అన్నారు. గురువారం మండల కేంద్రం కుంటాల స్థానిక రైతు వేదికలో ఉపాధిహామీ 15వ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ సిబ్బంది 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి మార్చి 31, 2025 మధ్య కాలంలో కుంటాల మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనుల పై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి నివేదికలను గ్రామాల వారీగా ప్రజా వేదికలో చదివి వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ప్రస్తుతం ధన దుర్వినియోగం దక్కిందన్నారు. ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా గ్రామాలలో కూలీలకు పని కల్పించడంతో పాటు వ్యవసాయదారుల పంట పొలాల్లో లేవ లింగ్ పనులు చేపల చెరువుల తవ్వకం, ఇంకుడు గుంతల తవ్వకం, పంట పొలాలకు రోడ్లు వేయడం తదితర పనులను సిబ్బంది కష్టపడి విధులు నిర్వహిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఇంటి ముందర, వ్యవసాయ భూమిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ చెరువులలో చేపల చెరువులు ఏర్పాటు చేస్తేనే లాభం చేకూరుతుందన్నారు. నర్సరీలలో అధిక సంఖ్యలో మొక్కలను పెంచాలన్నారు. ప్రభుత్వం హరితహరానికి ప్రాధాన్యత ఇస్తున్నందున ఈ పథకంలో నాటేందుకు మొక్కలు అవసరమని ప్రతి గ్రామంలో నర్సరీల్లో అధిక సంఖ్యలో మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా భూగర్భ జలాలు అడుగంటి పోకుండా ఉండేందుకు సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఇందుకోసమే ఇంకుడు గుంతలు తప్పనసరి అన్నారు. గ్రామాల్లో పేద ప్రజలకు తప్పనిసరిగా పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం పేద ప్రజల కోసమే ప్రవేశపెట్టిన పథకమని, ఈ పథకంలో ఎలాంటి నిధుల దుర్వినియోగానికి పాల్పడకుండా పేద ప్రజలకు పని కల్పించి సరియైన సమయంలో కూలీ డబ్బులు చెల్లించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ మెనేజర్ సుధాకర్, అంబుడ్స్‌మన్ నవీన్, విజిలెన్స్ అధికారి లక్ష్మణ్, ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీం, క్యూసీ కృపాకర్, పీఆర్ఏఈ గౌరీష్, ఏపీవో నవీన్, ఎస్ఆర్‌పీ మహేష్, డీఆర్‌పీలు, పంచాయతీ సెక్రటరీలు, టీఏలు ఉన్నారు.



అదనపు డీఐజీ అనిల్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న ధ్యాన హనుమాన్ వ్యవస్థాపకులు

ధ్యాన హనుమాన్ స్వామిని దర్శించుకున్న అడిషనల్ డీఐజీ

దిలావర్‌పూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాల్వ లక్ష్మీ నరసింహస్వామి చెంతనే కొలువైన ధ్యాన హనుమాన్ స్వామిని రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అనిల్‌కుమార్ గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అదనపు డీజీ అనిల్‌కుమార్ ధ్యాన హనుమాన్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనిల్‌కుమార్ వెంట జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల, అదనపు ఎస్పీ రాజేష్‌మీనా తదితరులున్నారు. కాగా ధ్యాన హనుమాన్ విగ్రహా వ్యవస్థాపకులు అయిండ్ల చంద్రమోహన్‌రెడ్డి, ఇప్ప నర్సారెడ్డిలు అదనపు డీజీకి పుష్పగుచ్చం అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని సన్మానించిన కంజర్ గ్రామస్థులు

లక్ష్మణచాంద, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని న్యూ కంజర్ గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన, నూతన ఆలయ ప్రారంభోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి వేద పండితుల ద్వారా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ... తాను దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ ఆలయ నిర్మాణానికి 15 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. నిర్మల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ఆలయాలను అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. అనంతరం ఐకే రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఆలయంలో ప్రతిష్ఠించిన హనుమాన్ విగ్రహం కోసం వడ్యాల్ గ్రామానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ బట్టు సువర్ణ ఆనంద్ రాజు రూ. 30 వేలను విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లోల సురేందర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, ద్యావతి పోశెట్టి, కేశం రమేష్, ఓస రాజేశ్వర్, సురేష్, శ్రీకాంత్ యాదవ్, గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా హనుమాన్ జయంతి

బైంసా, మే 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దక్షిణముఖి వీర్ హనుమాన్ ఆంజనేయ ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు కన్నుల పండుగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆలయ నిర్వాహక ప్రతినిధులు మందిరాన్ని, అంజనేయస్వామి విగ్రహాన్ని శోభయమానంగా అలంకరించారు. జయంతి వేడుకలలో భాగంగా ఉదయం వేళ అంజనేయ స్వామి విగ్రహానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకపూజలు చేపట్టారు. పట్టణ భక్తులతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు ఇక్కడి దక్షిణముఖి వీర్ హనుమాన్ ఆంజనేయ ఆలయానికి అధికసంఖ్యలో తరలి వచ్చి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

అయ్యో.. అన్నదాత!

● అకాల వర్షంతో కుదేలు ● ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



వరి పొలంలో చేరిన వర్షం నీరు

దిలావర్‌పూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలు అన్నదాత బతుకును అతలాకుతలం చేస్తున్నాయి. నోటి కాడికొచ్చిన బుక్కను నీటి పాలు చేస్తున్నాయి. రాత్రి, పగలు తేడా తెలియకుండా కష్టపడి పండించిన పంట కళ్లముందే తడిసి ముద్దవుతుంటే మౌనంగా ఏడవడం తప్ప ఏమి చేయలేని దుస్థితిలో రైతన్న కొట్టుమిట్టాడుతున్నాడు.

రైతుల్లో నిరాశ నిస్పృహలు

అకాల వర్షంతో రైతులు నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. ఎన్నో ఆశలతో సాగు చేసిన యాసంగి పంటను అకాల వర్షం నాశనం చేయడంతో రైతుల్లో తీవ్ర ఆవేదన వ్యకమవుతోంది. యాసంగిలో రైతులు వరితో పాటు నువ్వు, మొక్కజొన్న ఇతర ఆరుతడి పంటలు సాగు చేశారు. వరికోత మిషన్లు దొరకక కొన్ని గ్రామాల్లో వరిని కోత చేయలేదు. నువ్వ పంటను కోసి ఎండలో ఆరబెట్టారు. అకాల వర్షాలతో కోత కోయని వరి పంటతో పాటు కొనుగోలు కేంద్రాల్లో కుప్పలుగా పోసిన వరి ధాన్యం సైతం అకాల వర్షాలకు తడిసిపోయింది. అటు పొలంలో నీరు చేరి వరి కోయలేని పరిస్థితి ఉండగా ఇటు కోసిన వరి ధాన్యం కొను గోలు కేంద్రాల్లో తడిసిపోవడం రైతులను కలచి వేస్తోంది. నువ్వ పరిస్థితి అంతే. రైతులు నువ్వును కోసి కట్టలుగా కట్టి ఎండలో ఆరబెట్టారు. ఎండిపోయిన నువ్వు ఈ వర్షాలతో తడిసిపోయాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మొక్కజొన్న మాత్రం దాదాపు విక్రయాలు పూర్తికావ డంతో రైతులకు కొంత ఊరట లభించినట్లయింది. పంట లను అమ్ముకునే తరుణంలోనే అకాల వర్షాలతో నష్టం వాటిల్లుతుండటంతో రైతుల్లో నిరాశ నిస్పృహలు అలుముకుంటున్నాయి.

రైతే రాజు మాటల్లోనే..

రైతే రాజు అంటూ గొప్పగా చెప్పే నేతలు రైతుల కష్టాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతోంది. రైతుల సహకారంతో గద్దెనెక్కిన నేతలకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కనిపించడం లేదా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఎన్నికలు రాగానే రైతుల చుట్టూ తిరిగే నాయకులు ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టాల పాలవుతుంటే పట్టించుకోకపోవడం పట్ల వారిలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. అందరూ రైతుల మాట మాట్లాడే వారే కానీ ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో అటు అధికార పార్టీ నాయకులు గాని ఇటు ప్రతిపక్ష నాయకులు గాని కనీసం ప లకరించకపోవడం, భరోసా ఇవ్వకపోవడం పట్ల రైతులు నాయకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి..

అకాల వర్షాలతో తడిసిపోయిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు కోరుతు న్నారు. నాణ్యమైన ధాన్యానికే నాలుగు, ఐదు కిలోల చొప్పు న కోతలు పెడుతుండటంతో రైతుల్లో అధికారుల తీరుపై ఇప్పటికే అసంతృప్తి, అనుమానాలు వ్యక్తమవుతుండగా ఇప్పుడైతే తడిసిన ధాన్యం కావడంతో ఇంకెంత కోత పెడు తారోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అసలు తడిసిన ధాన్యం కొంటారా లేదా అనే అనుమానాలు రైతుల్లో లేకపోలేదు. తడిసిన ధాన్యాన్ని కోతలు లేకుండా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



వర్షం నీటిలో నుంచి వడ్లు తీస్తున్న రైతులు

ప్రభుత్వమే ఆదుకోవాలి

- చందు, వరి రైతు, దిలావర్‌పూర్



ఖరీఫ్ పంటలు పూర్తిగా పెట్టుబడులకు పోతాయి. ఏమన్నా మిగిలితే గీ యాసంగి పంటల తోనే... కానీ దేవుడు గిట్ల చుస్తుండు... చెడగొట్టు ఆనలతోని వడ్లు తడిసి పోయి నయ్... ఇంకా ఏముంటాయి... వర్షాకాలం పెట్టుబడికి డ బ్బులు యాడికెళ్లి తేవాలనో తెలుస్తలేదు. ప్రభుత్వమే మా మీద కొంచెం దయవుంచి నానిపోయిన వడ్లను కూడా కోతలు లేకుండా కొని వెంటనే డబ్బులు ఇయ్యాలే.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రైతన్న కన్నెర్ర

● తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన
● నిర్మల్ - ఖానాపూర్ రహదారిపై రాస్తారోకో
● రైతులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్న బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు



ఖానాపూర్‌లోని ఎన్టీఆర్ చౌక్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

ఖానాపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యంపై రైతాంగం కన్నెర్ర చేసింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసిపోవడంతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయలని డిమాండ్ చేస్తూ ఖానాపూర్‌లోని ఎన్టీఆర్ చౌక్‌లో నిర్మల్-ఖానాపూర్ రహదారిపై గురువారం రైతులు రాస్తారోకో నిర్వ హించారు. మూడు గంటలకు పైగా సాగిన ఈ రైతుల అందోళనకు బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు మద్దతు ఇచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ అబ్దుల్ ఖలీల్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య సహా పలు పార్టీల నాయకులు రైతులకు మద్దతుగా ధర్నాలో పాల్గొని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. రాస్తారోకో సందర్భంగా మాట్లాడిన రైతులు రెండు రోజులుగా వర్షాలు కురుస్తుంటే తమను కనీసం పలకరించే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖానాపూర్ మార్కెట్ యార్డ్ ఆవరణలోని పీఏసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎక్కడికక్కడే వర్షం నీరు నిలిచిపోవడంతో ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సెంటర్ నిర్వహణకు నిర్లక్ష్యంతో కొనుగోళ్లలో జాప్యం చేయడంతోనే తమకు కీ పరిస్థితి వచ్చిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం తడిసిపోయిందని ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా బేషరతుగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే వరకు తాము ఆందోళన విరమించబోమని భీష్మించుకుని కూర్చోవడంతో సుమారు మూడు గంటల పాటు ఖానాపూర్‌లో రాస్తారోకో కొనసాగింది. రైతుల రాస్తారోకో తో ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ కలెక్టర్ తీరుపై మండిపడ్డారు. కొద్ది రోజులుగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో తాను కలెక్టర్‌ను కోరినప్పటికీ ఆమె నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. నిర్మల్ జిల్లా లో వరి ధాన్యం కొనుగోళ్లలో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతున్నప్పటికీ ఇటు పాలకులు గాని అటు అధికారులు గాని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న దోపిడీలో జిల్లా కలెక్టర్ సహా ఇతర అధికార యంత్రాంగం, ప్రభుత్వ పెద్దల పాత్ర ఉందని రితేష్ ఆరోపించారు. అనంతరం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గౌరీకర్ రాజు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల లో జరుగుతున్న దోపిడీపై ఆందోళన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పార్టీల ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళన చేస్తామని నాయకులు హెచ్చరించారు.

● ప్రతీ ధాన్యపు గింజను కొంటాం..
జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,
ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు అందోళనకు దిగిన నేపథ్యంలో గురువారం ఖానాపూర్‌లోని మార్కెట్ యార్డ్ ఆవరణలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా తడిసిన ధాన్యాన్ని వారు పరిశీలించారు. అనంతరం రైతులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ... రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ధాన్యం తడిసిపోయిందని ఆందోళన చెందవద్దని, ప్రతి ధాన్యంపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యాన్ని శుభ్రపరిచి ఆరబెట్టేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో అదనపు తూకం, తక్కువ ధరకు కొనుగోలు లాంటివి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ జిల్లా కలెక్టర్‌కు సూచించారు. రైతు లకు నష్టం జరగకుండా చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు.



భైంసా ఏరియా ఆసుపత్రి



ఏరియా ఆసుపత్రిలోని ప్రసూతి వార్డు

భైంసా ఏరియా ఆసుపత్రికి మహర్దశ

● సమకూరనున్న ఆధునిక వసతులు, సౌకర్యాలు ● మెరుగుకానున్న నాణ్యమైన సేవలు

భైంసా, జూన్ 23: సమస్యల కాసారంలో కొనసాగుతున్న భైంసా ఏరియా ఆసుపత్రి మహర్ధశ పట్టనుంది. ఆసుపత్రి రూపు రేఖలు మారనున్నాయి. వసతుల లేమి, సౌకర్యాల కరువుతో రోగులు పడుతున్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి. అవస్థలు దూరం కానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని సర్కార్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన సేవలు అందించేందుకు గాను ఉద్దేశించిన బ్రాండింగ్ ప్రక్రియ కోసం మొదటి దశలో ఎంపిక చేసిన ఆసుపత్రుల జాబితాలో భైంసా ఏరియా ఆసుపత్రికి చోటు దక్కింది. రాష్ట్రంలోని 202 ఆసుపత్రులను బ్రాండింగ్ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో తొలి విడతగా 44 బోధనాసుపత్రులు, 40 వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులను ఎంపిక చేసింది. ఇందులో జిల్లా నుంచి భైంసా ఏరియా ఆసుపత్రికి చోటు దక్కింది.

● కార్పొరేట్ తరహా వసతులు, సౌకర్యాలు

బ్రాండింగ్ ప్రక్రియకు ఎంపికైన ఆసుపత్రులన్నింటిలోనూ ప్రభుత్వం కార్పోరేట్ ఆసుపత్రుల తరహాలో వసతులు, సౌకర్యాలు కల్పించనుంది. చికిత్సల కోసం వచ్చే రోగులకు మెరుగైన రీతిలో నాణ్యమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. రోగుల సౌకర్యార్థం అన్ని రకాల వసతులు కల్పించనున్నారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ ఇటీవల హైదరాబాద్‌లోని కోఠి వైద్య, ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో బ్రాండింగ్ ప్రక్రియకు ఎంపికైన ఆసుపత్రుల పర్యవేక్షణాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సంబంధిత ఆసుపత్రులలో కల్పించాల్సిన సౌకర్యాలు, వసతులపై ఆయా ఆసుపత్రుల పర్యవేక్షణాధికారులకు దిశ, నిర్దేశం చేశారు. ఇందులో భైంసా ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు డా.యూ.కాశీనాథ్ పాల్గొన్నారు.

● వేగవంతమైన చర్యలు

బ్రాండింగ్ ప్రక్రియలో భాగంగా వసతులు, సౌకర్యాల కల్పనలను రెండు నెలల్లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగానే ఏర్పాట్ల చర్యలను వేగవంతం చేసింది. వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం డిస్ట్రిక్ క్వాలిటీ మేనేజర్, రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) నుంచి ఇంజనీర్ బృందం భైంసాలో పర్యటించింది. ఇక్కడి ఏరియా ఆసుపత్రిలో సౌకర్యాలు,వసతులపై పరిశీలనలు చేపట్టారు. క్షేత్ర స్థాయిలో అధికార బృందం పర్యవేక్షణ నిర్వహించి చేపట్టాల్సిన వసతులు, సౌకర్యాలపై ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు. సంబంధిత నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిధులు కేటాయించి పనులన్నింటిని పూర్తి చేసి రోగులకు వసతులు, సౌకర్యాలు కల్పించి నాణ్యమైన సేవలు అందించే దిశగా రంగం సిద్ధం చేయనున్నారు.

వర్ణశోభితం.. రైతన్న సంతోషం

● ఆకాశం భూమిని ఆనందింపజేస్తున్న చిత్రంలో బసవన్నలతో రైతన్న



పొలంను చదును చేస్తున్న రైతన్నలు

తొలకరి జల్లు కోసం రైతులు ఎంతో ఆశగా ఆకాశం వైపు చూస్తుంటారు. వచ్చేవాన చినుకుల కోసం కర్షకుడు పంట పొలాన్ని చదును చేసి వర్షాల కోసం ఎదురు చూస్తు ఉండేలా కనిపిస్తున్న ఈ చిత్రమే నిదర్శనం. ఇచ్చోడ మండలంలోని పంట పొలంలో రైతన్న కార్లతో దున్నుకు కనిపించే ఈ చిత్రంలో ఆకాశం వర్ణ శోభితంగా కనిపిస్తుంది. ఈ యేడాది ఖరీఫ్‌లో రుతుపవనాలు ముందస్తుగా వస్తున్నాయని వాతావరణ శాఖ సూచన మేరకు రైతులు తమ పనులను ముందస్తుగా చేసుకుంటున్నారు. నిజానికి ఈ యేడాది వర్షాలు తొందరగానే పడుతుండడంతో రైతన్నలంతా సంతోషంగా ఉన్నారు. దాదాపు 70శాతం రైతులు విత్తనాలను కొనుగోలు చేసి ఇంటి వద్ద నిలువ ఉంచుకున్నారు. తొలకరి జల్లులు కురవగానే తమ పంట పొలాల్లో విత్తనాలు విత్తుకునేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. రుతుపవనాలు ముందస్తుగా రావడంతో రైతులు పనులు ముందస్తుగా చేసుకుంటున్నారని దానికి నిదర్శనం ఈ చిత్రం.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్)

బోథ్ ఎమ్మెల్యే గారి తాలూకా..

● బండెక్కిన అభిమానం

ఇచ్చోడ, మే, 22 (ఆంధ్రజ్యోతి): మనుషులను అభిమానించ డం పలు రకాలు.. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలువురు అక్కడి ఉప ముఖ్యమంత్రి పై అభిమానంతో పిఠాపురం ఎమ్మెల్యే గారి తాలూకా అని ద్విచక్రవాహనంపై కార్లపై రాసుకుని అభి మానం చాటుకున్నారు. అలాంటి అభిమానమే ఇచ్చోడ మండల కేంద్రంలో గురువారం దర్శనమిచ్చింది. గుర్తుతెలియని వ్యక్తి ఇచ్చోడలో తన వాహనం నిలిపి ఉంచగా.. బైక్ వెనకల ఉండే నంబరు ప్లేట్‌పై ఆర్టీవో అధికారులు జారీచేసిన నంబరు స్థానంలో నేను బోథ్ ఎమ్మెల్యే గారి తాలూకా అని పెద్దపెద్ద అక్షరాలతో లిఖించిన నంబరు ప్లేట్ కనిపించింది. అభిమానం ఉండడం సరైనదే కానీ మోటరు వాహన చట్టాన్ని అనుసరించాల్సిందేనని పలువురు తమ అభిప్రాయా న్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తాలూకా అంటే ఎవరూ అపరెమోననే ధైర్యం.. ఎమ్మెల్యేపై అభిమానంతో ఇలా రాసుకుని మరీ రహదారి పైకి వచ్చిన ఈ చిత్రాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్‌మనిపించింది.



అధ్వానంగా గిరిజన గ్రామాల రోడ్లు

● పట్టించుకోని పాలకులు, అధికారులు ● పల్లె జనానికి తప్పని ఇబ్బందులు

తలమడుగు, మే 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆదివాసి గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నామని చెబుతున్నప్పటికీ కొంతమంది అధి కారుల నిర్లక్ష్యం కాం ట్రాక్టుగా ఇష్టారాజ్యంతో ఆదివాసి గిరిజనులకు అభివృద్ధి ఫలాలు అందడం లేదు. ముఖ్యంగా ఆదివాసి గిరిజన గ్రామాలకు రోడ్లు సక్రమంగా లేకపోవ డంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గిరిజనులు ఆందోళన వ్య క్తం చేస్తున్నారు. వివరాల్లోకెళ్తే అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ కొట్టుకపోయి అధ్వానంగా మారిన ఇప్పటి వరకు వాటిని ఎవరు పట్టించుకోవడంలేదని సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారం 10 రోజుల్లో మళ్లీ వర్షాకాలం ప్రారంభమవుతున్నప్పటికీ రోడ్లకు మరమ్మతులను ఎవరు చేపట్టడం లేదని ఆదివాసి గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గిరిజన రోడ్లను మరమ్మతులతో పలుమార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించిన ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. హామీలు ఇస్తున్నారు తప్ప వాటిని అమలు పరచడం లేదని వారు పేర్కొన్నారు. రోడ్లు మరమ్మతులు చేపట్టక పోవడంతో అటుగా వెళ్లాలంటేనే ప్రయాణికులు జంకుతున్నారు. మండలంలోని దేవాపూర్ నుంచి బరంపూర్ వరకు, బరంపూర్ నుంచి జరీ పునా గూడ కూడా వరకు, జరి నుంచి డోర్లీ వరకు, టోకీ కూడా నుంచి జరీ వరకు, రుయాడి నుంచి కజ్జర్ల వరకు రోడ్లన్నీ భారీ వర్షాలకు దెబ్బతిని అధ్వానంగా మారాయి. వీటిని మరమ్మతులు చేపట్టాలని మండలవాసులు అధికారులకు విన్నవించారు. కానీ ఇప్పటి వరకు మరమ్మతుల కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. వర్షాకాలంలో ఈ రోడ్ల గురించి ప్రయాణం చేయాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం చేయవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అదేవిధంగా ఆయా గ్రామాల సమీపంలోని లో లెవెల్ వంతనాలు ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. హైలెవెల్ వంతెనల నిర్మాణం కేవలం ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఇకనైనా అధికారులు స్పందించి మారుమూల గిరిజన గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

● అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు



భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేపట్టాలని అధికారులకు, నాయకులకు విన్నవించిన ఎవరు పట్టించుకోవడం లేదు. రోడ్లు సక్రమంగా లేకపోవడంతో అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లాలంటే అర చేతుల ప్రాణం పెట్టుకొని వెళ్లవలసిన పరిస్థితిలో ఏర్ప డుతున్నాయి. ఆదివాసి గ్రామాలపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు చిన్న చూపే గత ఐదు సంవత్సరాల క్రితం జరీ నుంచి టోకీ కూడా వరకు వేసిన రోడ్డు సక్రమంగా వేయకపోవడంతో చిన్న వర్షాలకు మరమ్మతు లకు గురవుతుంది.

- సీడం జనక పటేల్, మాజీ సర్పంచ్



ఝరి నుంచి టోకిగూడ వరకు అధ్వానంగా మారిన రోడ్డు

ఎటుచూసినా.. చూచిరాతలే!

• దూర ప్రాంతాల నుంచి ఇచ్చోడలో అడ్మిషన్లు పొందుతున్న విద్యార్థులు • ఇచ్చోడలో 4500కు చేరువలో డిగ్రీ విద్యార్థుల సంఖ్య

ఇచ్చోడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షలలో జోరుగా చూచిరాతలు నడుస్తున్నాయనడానికి నిదర్శనం ఈ చిత్రాలు. గతవారం ప్రారంభమైన సెమిస్టర్ పరీక్షలల్లో చూచి రాతలను స్థానిక అన్ని డిగ్రీ కళాశాలల యాజమాన్యులు ప్రోత్సహిస్తున్నా రని ఇక్కడి స్థానికులు అంటున్నారు. ఇదిలా ఉండగా.. కళాశాల యాజమాన్యులు వారి స్వలాభం కోసం విద్యార్థులకు భవిష్యత్తులో కేవలం పట్టాలే తప్ప సబ్జెక్టు ఉండదని అంటున్నారు. విషయ పరిజ్ఞానం లేకుం డా చూచిరాతల ద్వారా ఉత్తీర్ణులైతే ఉద్యోగావకాశాలు ఏమాత్రం ఉండ వని పోటీపరీక్షల్లో విద్యార్థులు విజయం సాధించడం చాలా కష్టమని వారు అభిప్రాయపడుతున్నారు. ఇచ్చోడ మండల కేంద్ర పరిధిలోని కళాశాలల్లో అడ్మిషన్లు పొందితే.. ఎలాగైనా డిగ్రీ పట్టా పొందవచ్చనే ఉద్దేశ్యంతో ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, తదితర దూర ప్రాంతాల నుంచి కూడా విద్యార్థులు ఇక్కడ అడ్మిషన్లు పొందడం గమనార్హం. ఇచ్చోడ పరిధిలో ఒక ప్రభుత్వ కళాశాలతో పాటు నాలుగు ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాల పరిధిలో దాదాపు 4500 మంది విద్యార్థులు డిగ్రీ విద్యను అభ్యసిస్తుండడం విశేషం. రోజుకు దాదాపు 900 నుంచి 1100 మంది పరీక్షలు రాస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో విధులు నిర్వహించే అధికారుల కంటపడకుండా పరీక్ష కేంద్రం కిటికిలోంచి ఆరుబయట రహదారులపై చిట్టీలు కనిపిస్తున్నాయి. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల చిందరవందరగా పడిఉన్న చిట్టీలను చూసి విద్యార్థులు చూచిరాతలపై ఆధారపడేలా కళాశాల యాజమాన్యాలు పోటాపోటీగా తయారవుతున్నారని కేవలం తమ కళాశాలలోనే అడ్మిషన్లు పొందాలని విద్యార్థుల్ని ఉత్తీర్ణుల్ని చేసేందకు ఇంతటి తతంగాన్ని నడిపిస్తున్నారు. ఇకనైనా ప్రవేటు కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవడం.. చివర్లో పరీక్షలు రాయడం తప్ప పాఠాలు బోధించే కళాశా లలు కనిపించడంలేదని, ప్రైవేటు కళాశాలల ఆగడాలను కట్టడి చేసి ప్ర భుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన నిరంతర విద్య లభిస్తుందని ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని పలువురు పట్టభద్రులు పేర్కొంటున్నారు. ఇంత తతంగం జరుగుతున్న కాకతీయ పరిధిలోని ఎగ్జామినేషన్ బ్రాంచ్ పట్టించుకోకుండా మామూలుగా తీసు కోవడం గమనార్హం.



ఇచ్చోడలో పరీక్షా కేంద్రాల వద్ద చెల్లాచెదురుగా పడి ఉన్న చిట్టీలు

- రాజకీయ నేతలపై పెరుగుతున్న ఒత్తిళ్లు
- రాజీనామా యోచనలో ఓ పార్టీ పట్టణ అధ్యక్షుడు
- ఆందోళన బాట పట్టిన వీధి వ్యాపారులు
- ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై పట్టణవాసుల హర్షం



రోడ్డుపై ఏర్పాటు చేసిన తోపుడుబండ్లను తరలిస్తున్న అధికారులు



వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న పట్టణ సీఐ



ఆక్రమణల తొలగింపుపై అలజడి!

ఆదిలాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టడం కొత్త వివాదానికి దారి తీస్తోంది. పట్టణ రోడ్లపై ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ట్రాఫిక్ క్లియర్‌పై హర్షం వ్యక్తమవుతున్నా మరో వైపు ఆవేదన, ఆగ్రహం కూడా కనిపిస్తోంది. ఉన్నట్టుండి మున్సిపల్, పోలీసు అధికారులు కొరడా ఝులిపించడంతో వీధి వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. అలాగే ఓ ప్రధాన పార్టీకి చెందిన పట్టణ అధ్యక్షుడు రాజీనామా చేసేందుకు సైతం సిద్ధమైనట్లు ప్రచారం సాగుతోంది. ప్రధానంగా పట్టణంలోని దేవిచంద్‌చౌక్, గాంధీచౌక్, శివాజిచౌక్, అంబేద్కర్‌చౌక్, వినాయక్‌చౌక్, పంజాబ్ చౌక్‌లలో రోడ్డుకిరువైపుల ఏర్పాటు చేసుకున్న తోపుడు బండ్లు, వ్యాపారాలను తొలగించారు. త్వరలోనే మున్సిపల్ కార్యాలయం పరిసరాలతోపాటు ఎన్టీఆర్‌చౌక్, కలెక్టర్‌చౌక్, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని ట్రాఫిక్ సమస్యపై దృష్టిని సారించనున్నారు. ఇప్పటివరకు 250మంది వీధి వ్యాపారులను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రత్యామ్నాయంగా పట్టణంలోని గణేష్ థియేటర్ స్థలంలో 202షాపుల ఏర్పాటుకు స్థలాలను కేటాయించారు. ఇప్పటివరకు 125మంది వ్యాపారులు అధికారులు కేటాయించినస్థలంలో షాపులను ఏర్పాటు చేసుకున్నట్లు చెబుతున్నారు. మిగితా వారిని కూడా తరలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతున్న తోపుడు బండ్లను తొలగిస్తామంటూ గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో అధికారులు చర్యలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. అధికారుల చర్యలు రాజకీయవర్గాల్లో అలజడి రేపుతోంది. ఫుట్‌పాత్ వ్యాపారంతో కొంత మంది స్థానిక నేతలకు సంబంధాలు ఉండడం అసలు కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది నేతలు అధికారులపై ఒత్తిళ్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపుతున్న అధికారులను అభినందిస్తూనే వీధి వ్యాపారులకు భరోసాను కల్పించాలన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నేతల వద్దకు పరుగులు

అధికారులు కొరడా ఝులిపించడంతో పలువురు వ్యాపారులు నేతల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఎలాగైనా అధికారుల చర్యలను ఆపే విధంగా చొరవ తీసుకోవాలని నేతల వద్ద మొరపెట్టుకుంటున్నారు. వీధి వ్యాపారంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని ఉన్న ఒక్క ఆధారం కోల్పోతే బతకడం కష్టమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అగ్రనేతల వద్ద మొరపెట్టుకుంటున్నారు. స్థానిక నేతలతో నియోజకవర్గ స్థాయి అగ్రనేతలపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. అధికారులు చేపట్టిన చర్యలు నేతలకు తలనొప్పిగా మారుతున్నాయి. వ్యాపారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో సమాధానం చెప్పలేక నేతలు సతమతమవుతున్నారు. కాదు కూడదు అనలేక బాధితుల ముందు అధికారులకు ఫోన్ చేస్తున్నా అక్రమాల తొలగింపు మాత్రం ఆగడం లేదంటున్నారు. అలాగే త్వరలో జరగబోయే బల్దియా ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



రిలే నిరాహార దీక్షలు చేపడుతున్న వీధి వ్యాపారులు

తీవ్ర అసంతృప్తి

పట్టణంలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు పై ఓ పార్టీకి చెందిన నేత తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అధికారుల చర్యలతో అన్యాయం జరిగిందంటూ ఆవేదనకు లోనైనట్లు తెలిసింది. ఓ పార్టీకి పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్న అధికారుల చర్యలను అడ్డుకోలేక పోయారన్న అసంతృప్తి కనిపిస్తోంది. పలుమార్లు అగ్రనేతదృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకపోవడంతో పార్టీ పట్టణ అధ్యక్ష పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఆ నేత చేసిన పోస్టులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. నేతల సిఫారసులను మున్సిపల్, పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణ రాజకీయాల్లో కీలకమైన నేత మాట నెగ్గకపోవడంతో తీవ్రమనస్థాపానికి గురైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారుతోంది.

కలెక్టరేట్ ముందు నిరసన

మున్సిపల్, పోలీసు శాఖ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించడంతో పలువురు వీధి వ్యాపారులు ఆందోళనబాట పట్టారు. గత మూడు రోజులుగా జిల్లా కలెక్టరేట్ ముందు రిలే నిరాహార దీక్షలను చేపడుతూ నిరసన తెలుపుతున్నారు. యథావిధిగా (తరువాయి 6వ పేజీలో..)



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళ

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

నార్నూర్, మే22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని కలెక్టర్ రాజార్షిషా ఆదేశించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, బడిబాటలో ప్రభుత్వ బడుల విద్యార్థుల అధిక సంఖ్యలో చేరేలా అందరూ ప్రణాళిక సిద్ధం చేయాలని పేర్కొన్నారు. పాఠశాల అవసరమైన మౌలిక సదుపాయాలు గురించి మండల విద్యా అధికారి అనితను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు సంబంధించిన స్థలంపై రెండురోజుల్లో పూర్తిగా సర్వేచేసి మ్యాప్ అందించాలని డిప్యూటీ తహసీల్దార్ శ్యాంసుందర్‌ను ఆదేశించారు. రైతువేదిక దగ్గరా ఉన్న ఎంపీపీ పాఠశాల విద్యార్థుల కోసం వెంటనే కొత్తగా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలని షేక్ దస్తగిరికు చెప్పారు. వారి వెంట అధికారులు గ్రామస్థులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వినతి

నీరుపేద కుటుంబానికి చెందిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని మండల కేంద్రానికి చెందిన షేక్ జాకీర్ కలెక్టర్ రాజార్షిషాను విన్నవించాడు. మండలకేంద్రానికి చెందిన ఎస్ఎస్ఆర్ జీనింగ్‌లో గురు వారం రైతుల అవగాహన సదస్సుకు హాజరు కాగా షేక్ జాకీర్ అక్కడి చేరుకుని ఇందిరమ్మ కమిటీ సభ్యులు తన పేరుని అర్హుల జాబితా నుంచి తొలగించారని, తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరాడు.

ఫర్టిలైజర్ యజమానిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గత నవంబర్‌లో నార్నూర్ మండలకేంద్రానికి చెందిన రాహుల్ ఫర్టిలైజర్ యజమాని వద్ద 20కిలోల శనగ విత్తనాల కొనుగోలు చేయగా.. అవి మొలకెత్తలేదని వ్యవసాయ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని జమడా గ్రామానికి చెందిన కుమ్మరా నిలాబాయి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దుకాణ యజమాని తనను అవమానించాడని, అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసునమోదు చేయాలని ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీఇచ్చారు. అలాగే ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటూ ఏళ్లుగా సాగు చేస్తున్న ఎస్సీ ఇతర రైతులను ఆదుకోవాలని ఆదివాసీ పర్ధాన్ పురోహిత సంఘం జిల్లా అధ్యక్షుడు గెడం నిరంజన్ జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు విన్నవించారు.

హెచ్‌టీ సర్వీసుల మంజూరుకు సింగిల్ విండో వ్యవస్థ

- ఆదిలాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జేఆర్ చౌహాన్

ఆదిలాబాద్‌అర్బన్, మే22 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హెచ్‌టీ 11 కేవీ, 33కేవీ ఆపై వోల్టేజీ సర్వీసుల మంజూరు వేగవంతం చేసేందుకు సింగిల్ విండో వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు ఆదిలాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జేఆర్ చౌహాన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హెచ్‌టీ 11కేవీ, 33కేవీ, ఆపై ఓల్టేజీ సర్వీసుల మంజూరుకు మరింత సరళీకృతం చేయడానికి హెచ్‌టీ మానిటర్ సెల్‌ను సర్కిల్ ఆఫీస్, కార్పొరేట్ ఆఫీసులో ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగానే 11 కేవీ ఓల్టేజి దరఖాస్తులను సర్కిల్ ఆఫీస్ ఏడీఈ కమర్షియల్ అధికారి మానిటర్ చేస్తారని, అలాగే 33కేవీ ఓల్టేజీ, ఆపై ఓల్టేజి దరఖాస్తులను ఏడీఈ కమర్షియల్ కార్పొరేట్ ఆఫీస్ అధికారి మానిటర్ చేస్తారని పేర్కొన్నారు. సింగిల్ విండో వ్యవస్థ వలన త్వరితగతిన సర్వీసులు మంజూరవుతాయని, ప్రతీసారి ఆఫీసులకు రాకుండా ట్రాక్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. దీంతో అత్యంత పారదర్శకత పెరుగుతుందని, ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం పంపబడుతుందని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

ఎస్సీ, ఎస్టీల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్, మే22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమాన్ని విస్మరిస్తోందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. సబ్ ప్లాన్ నిధుల గురించి చట్టాలు తయారైనప్పటికీ నిధుల విడుదలలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తుందని విమర్శించారు. అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా నిధులను విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ కేంద్రం ఇస్తున్న నిధులను రాష్ట్రప్రభుత్వం ఈనెల 25 లోపు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. గిరిజనుల అభివృద్ధితోపాటు వారికి మౌలిక వసతులు కల్పించడానికి కేంద్రం నిధులిస్తున్నారాష్ట్రప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని ఆరోపించారు.

పందుల బెడద నుంచి కాపాడాలని వినతి

ఉట్నూర్, మే22 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ పట్టణంలోని పలు ప్రాంతాలలో పందుల బెడద తీవ్రంగా పెరిగిందని గ్రామ పంచాయతీ ద్వారా పందుల నిర్మూలన కోసం చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ పట్టణ వాసులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి మొరపెట్టుకుంటున్నారు. గురువారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని సేవదాస్‌నగర్‌నందలి సేవాలాల్ గుడి దగ్గరి ట్రాన్స్‌ఫార్మర్‌కి చుట్టుపక్కల, సుభాష్‌నగర్, శాంతినగర్, విద్యానగర్, నాయక్‌నగర్ ప్రాంతాలలో పందులు గుంపులుగా స్వైరవిహారం చేస్తూ జనవాసాలలోకి వస్తూ ఇబ్బంది పెడుతున్నాయన్నారు.

'బకాయి వేతనాలు చెల్లించాలి'

ఉట్నూర్, మే22 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న దినసరి ఉద్యోగులు, తాత్కాలిక వర్కర్లు, శానిటేషన్ సిబ్బందికి సరిపడే విధంగా 12 నెలల వేతనాల బడ్జెట్లో మంజూరు చేయాలని గిరిజన సంక్షేమ నాలుగవ తరగతి దినసరి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకోబ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కేబీసీ నారాయణలు కోరారు.ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని సంక్షేమ కమిసనర్ కార్యాలయం పరిపాలన అధికారికి వినతి పత్రం అందజేశారు.

గుండెపోటుతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మృతి

ఉట్నూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని రాజన్నగూడెంకు చెందిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత (43) గురువారం ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా గుండెపోటుతో మృతిచెందారు. ఉట్నూర్ మండలంలోని షాంపూర్ అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తూ 12ఏళ్ల క్రితం పదోన్నతిపై కొమురంభీం జిల్లా జైనూరు మండలానికి సూపర్‌వైజర్‌గా బదిలీఅయ్యారు. సొంత ఊరైన రాజన్నగూడెంకు ఆసిఫాబాద్ నుంచి బస్సులో వస్తుండగా గుండెపోటు నొప్పి రాగా.. గమనించిన ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందికి తెలిపి బస్సులో ఉట్నూర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- కలెక్టర్, అదనపు కలెక్టర్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

ఆదిలాబాద్ అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): అకాలవర్షాల నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి టెలికాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో అకాల వర్షాలు, వరి ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ సీజన్ సన్నద్ధం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాటాడుతూ అకాల వర్షాలు ఇంకా 2, 3 రోజులు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన విత్తనాలు, యూరియా కొరత లేకుండా చూడాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, వాగుల వైపు ఎవరూ వెళ్లకుండా భద్రత చర్యలు చేపట్టామని, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేడుతున్నట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు సమకూర్చడం జరిగిందని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన విత్తనాలు, యూరియా కొరతలేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి నకిలీ, నిషేధిత విత్తనాలు విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాల అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

ఉట్నూర్, మే22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగన్నపేట వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రాథోడ్‌రవీందర్ గురువారం పరిశీలించారు. ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేసి గోదాములకు పంపించాలని ఆదేశించారు. ఆయనవెంట డీపీఎం గోవింద రావు, ఐకేపీ ఏపీఎం అనిల్‌కుమార్, సలీం తదితరులున్నారు.

నకిలీ పత్రాలు సృష్టించిన ఇద్దరి అరెస్టు : సీఐ

ఆదిలాబాద్ రూరల్, మే22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాలక్ష్మీవాడకు చెందిన ఆరే సుదర్శన్‌కు చెందిన ప్లాటును నవనీత్, మహేందర్, చేతన్ కుమార్‌లు నకిలీ దస్తావేజులను సృష్టించారన్నారని 2 టౌన్ సీఐ కరుణాకర్‌రావు గురువారం తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఇద్దరిని అరెస్ట్ చేయగా, చేతన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

విద్యార్థిని పట్ల అసభ్య ప్రవర్తన
ప్రిన్సిపాల్‌కు ఏడాది జైలు శిక్ష

ఆదిలాబాద్ రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 9వేల జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. మావలలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గతేడాది జనవరి 3న ఓ మైనర్ విద్యార్థిని పట్ల స్కూల్ ప్రిన్సి పాల్ ఫణి మోహన్‌రావు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు మావల పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై విష్ణువర్ధన్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు డీఎస్పీ జీవన్‌రెడ్డి కేసు విచారణ జరిపి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో నేరం రుజువైంది. ఈ మేరకు నిందితుడైన ప్రిన్సిపాల్ ఫణిమోహన్‌రావుకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

పెండింగ్‌లో ఉన్న కేసులను పూర్తి చేయాలి: ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ సబ్‌డివిజన్ పరిధిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను వీలైనంతా త్వరగా సరైన సమయంలో, సరైన దర్యాప్తును పూర్తిచేసి ప్రజలకు న్యాయం చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో మూడు పట్టణ పోలీసు స్టేషన్‌లు, మూడు సర్కిల్ కార్యాలయాలు, మొత్తం 12 పోలీసుస్టేషన్ పరిధిలో దాదాపు 300 కేసులను సాధ్యమైనంత వరకు పూర్తిచేయాలని సూచించారు. బాధితులకు న్యాయం చేస్తూ నేరస్థులకు శిక్ష పడేలా చూడాలన్నారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న కేసులలో ఎంసీ రిపోర్టులు, పీఎంఈ రిపోర్టు, ఎంవీఐ రిపోర్టులు, ఫైర్ అధికారి కార్యాలయంలో ఉన్న పెండింగ్ రిపోర్టులు, అగ్రికల్చర్ కార్యాలయంలో ఉన్న రిపోర్టులు చిన్న వాటిని త్వరగా సంబంధిత అధికారులతో మాట్లాడి పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఎక్సైజ్ కేసులలో వారం రోజులలోపు స్వాధీనం చేసుకున్న వాటిని ఫోరెన్సిక్ లాబరేటరికి పంపాలన్నారు. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని పెండింగ్‌లో ఉన్నకేసులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు బి.సునిల్‌కుమార్, సీహెచ్ కరుణాకర్‌రావు, కె. ఫణిదర్, వెంకటేశ్వరరావు, స్వామి, ఎస్సైలు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్



పాల్గొన్న పోలీసు అధికారులు



మాట్లాడుతున్న అధికారి రాజేంద్ర ప్రసాద్

బడిబయట పిల్లలను గుర్తించేందుకు సర్వే

ఆదిలాబాద్‌రూరల్, మే22 (ఆంధ్రజ్యోతి) : బడిబయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు బాలల సంరక్షణ జిల్లా అధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా జిన్నింగ్ ఫ్యాక్టరీలు, కంకర క్రషర్, దాబాల్లో గురువారం సంబంధిత శాఖ సిబ్బందితో కలిసి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని జిన్నింగ్ ఫ్యాక్టరీ, ఇతర ఫ్యాక్టరీలలో వలస కార్మిక కుటుంబాలు ఎన్ని.. ఎంతమంది పనిచేస్తున్నారు.. అందులో పిల్లలు ఎంతమంది ఉన్నారు.. అనే వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఫ్యాక్టరీలలో బడీలు పిల్లలు ఉంటే వారికోసం ప్రత్యేకంగా వర్క్ సైడ్ స్కూల్ (పనిచేసే ప్రదేశంలో పాఠశాల)ను కలెక్టర్ ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ఫ్యాక్టరీ యజమానులతో మాట్లాడి పేరు వివరాలను నమోదు చేసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే సర్వే నిర్వహిస్తున్నామని మరో వారంలోపు పూర్తి చేస్తామన్నారు. సర్వేలో ఎల్‌సీపీఓ రమేష్, షూర్ ఎన్‌జీఓ జిల్లా కోఆర్డినేటర్ కె.వినోద్, డీసీపీయూ సిబ్బంది పద్మ, ప్రేమేందర్, కార్మిక శాఖ సిబ్బంది సుదీప్ పాల్గొన్నారు.

మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారు: మాజీ మంత్రి

ఆదిలాబాద్‌అర్బన్, మే22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలన కంటే కేసీఆర్ పాలన బాగుండేనని, మరోసారి కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న సమక్షంలో నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజక వర్గ ముఖ్య నాయకులతో నిర్మల్‌లో సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. అనంతరం జోగురామన్న మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ మోసపూరిత హామీలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మళ్లీ కేసీఆర్ పాలనను ప్రజలుకోరుకుంటున్నారని అన్నారు. ఇందులో నాయకులు రామకృష్ణారెడ్డి, రమాదేవి, విలాస్, శ్యామ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తగిలి రైతు మృతి



మృతిచెందిన బోయర్ దాము

జైనథ్, మే 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఓ రైతు ప్రాణాలను బలి తీసుకుంది. విద్యుత్ తీగ తగిలి ఓ రైతు ప్రాణాలు కోల్పోయిన ఘటన జైనథ్ మండలంలోని సాంగ్వి(కె) గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. సాంగ్వి(కె)కి చెందిన బోయర్ దాము (50) రోజూ లాగే పొలం పనులు చేసేందుకు ఉదయం వెళ్లాడు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతు దాముకు కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలి అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జైనథ్ మండల ఎస్సై గౌతం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గౌతం తెలిపారు. 33/11కేవీ విద్యుత్ తీగలు కింది వేలాడుతున్నాయని విద్యుత్ ఏఈలకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఫలితంగా ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.